క్లుప్తంగా

చెక్‌డ్యాంల నిర్మాణం పరిశీలన



చెక్‌డ్యాం పనులను పరిశీలిస్తున్న ఇరిగేషన్ ఈఈ

దుమ్ముగూడెం: మండలంలోని బొజ్జికుప్ప దగ్గర గుర్రాలబైలు వాగుపై నిర్మిస్తున్న చెక్ డ్యాం పనులను ఇరిగేషన్ ఈఈ సయ్యద్ అహ్మద్ జానీ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఈఈ మాట్లాడుతూ.. చెక్‌డ్యాం నిర్మాణ పనులు నాణ్యతతో చేపట్టాలని సూచించారు. పనులను త్వరగా పూర్తి చేసి వర్షాకాలం నాటికి అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట ఇరిగేషన్ డీఈఈ మధుసూధన్‌రావు, జేఈ రాజ్ సుహాస్, పీటీ మస్తాన్ వలీ ఉన్నారు.

నేటి నుంచి సమ్మర్ క్యాంప్



సమ్మర్ క్యాంప్ బ్రోచర్లు విడుదల చేస్తున్న ఎంఈఓ ఆనంద్‌కుమార్

అన్నపురెడ్డిపల్లి (చండ్రుగొండ): మండలంలోని ఎర్రగుంట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నేటి నుంచి 15 రోజుల పాటు విద్యార్థులకు సమ్మర్‌క్యాంప్ నిర్వహించనున్నట్లు ఎంఈఓ ఉండేటి ఆనంద్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం క్యాంప్ బ్రోచర్‌ను విడుదల చేశారు. క్యాంప్‌లో ఆటలు, యోగా శిక్షణ, వేదగణితం, డ్రాయింగ్, పాటలు, స్కౌట్ అండ్ గైడ్స్‌కు చెందిన అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన వివరించారు. ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు ఈ క్యాంప్ ఏర్పాటు చేసినట్లు ఇతర విద్యార్థులు కూడా ఈ క్యాంప్‌లో పాల్గొనవచ్చని తెలిపారు.

లబ్ధిదారుల జాబితా విడుదల

చండ్రుగొండ: మండలంలోని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితను ఎంపీడీఓ బయ్యారపు అశోక్ శుక్రవారం విడుదల చేశారు. 14 పంచాయతీల్లో 3,714 మంది పథకానికి అర్హులుగా గుర్తించారు. అయితే అందులో 677 మందికి తొలివిడతగా ఇళ్లు మంజూరైనట్లు ఎంపీడీఓ వివరించారు. పైలెట్ ప్రాజెక్ట్‌గా బెండాలపాడులో ఇప్పటికే 307 ఇళ్లు ప్రారంభించినట్లు తెలిపారు. విడతల వారిగా అర్హులందరికీ ఇళ్ళు మంజూరు చేయనున్నట్లు చెప్పారు. ఇళ్లు ఇప్పిస్తామని దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని ఆయన హెచ్చరించారు.

రహదారిపై చెట్టు తొలగింపు



రహదారిపై చెట్టును తొలగిస్తున్న సీఐ అశోక్‌రెడ్డి, సిబ్బంది

అశ్వాపురం: మండల పరిధిలోని నెల్లిపాక గ్రామంలో మొండికుంట–భద్రాచలం రహదారిపై గత రెండు రోజుల క్రితం ఈదురు గాలులకు చెట్టు రోడ్డుపై పడింది. రాకపోకలకు ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతుండటంతో విషయం తెలుసుకున్న సీఐ అశోక్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని జేసీబీతో శుక్రవారం రహదారిపై చెట్టును తొలగించారు. చెట్టును తొలగించిన సీఐ, పోలీస్ సిబ్బందికి స్థానికులు అభినందనలు తెలిపారు.

అర్హులందరికీ ఇళ్లు ఇవ్వాలి

అశ్వాపురం: ప్రజాపాలన గ్రామ సభల్లో గుర్తించిన అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం అశ్వాపురంలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇళ్లను పేదవాళ్లకు కాకుండా కార్యకర్తలకు ఇవ్వడం సరికాదన్నారు. గతంలో గ్రామసభలో గుర్తించిన అర్హులందరికి ఇండ్లు ఇవ్వాలని లేని పక్షంలో గ్రామ సభల్లో ఎంపిక చేసిన లబ్ధిదారులతో, కలిసివచ్చే పక్షాలతో ఆందోళనలు చేపడతామన్నారు.

క్రీడాకారుడికి అభినందన

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు క్రీడాకారుడుని శుక్రవారం అభినందించారు. హిమాచల్ ప్రదేశ్‌లో జరిగిన 5కే రన్నింగ్ చాంపియన్ షిప్‌లో సిల్వర్ మెడల్స్ సాధించిన చిట్టిమళ్ల డేవిడ్‌రాజ్‌ను ఎమ్మెల్యే శాలువతో సత్కరించారు. పలువురు క్రీడాకారులు, నాయకులు పాల్గొన్నారు.

ఆదిలోనే అవకతవకలు

- ఇందిరమ్మ ఇళ్ల పథకంపై ఆరోపణలు
- రాజకీయ నేతల జోక్యంతో లబ్ధిదారుల్లో ఆందోళన
- నత్తనడకన సాగుతున్న ఇళ్ల నిర్మాణం

భద్రాచలంటౌన్: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు ఆదిలోనే అక్రమాలు వెలుగుచూశాయి. ఆధికారులు పారదర్శకంగా నిర్వహించాల్సిన పథకంలో రాజకీయ జోక్యం ఉండడంతో లబ్ధిదారుల్లో గందరగోళం నెలకొంది. క్షేత్ర స్థాయిలో ప్రభుత్వం నిర్దేశించిన నియమాలతో లబ్ధిదారుల ఎంపిక జరగడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం అందుబాటులో ఉన్న టెక్నాలజీతో సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారని తెలుస్తోంది.

భద్రాచలంలో ఘటన..



నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇల్లు

భద్రాచలం డివిజన్‌లోని మండలాల్లో ఎంపిక చేసిన పంచాయతీల్లో పనులను స్థానిక ఎమ్మెల్యేతో ప్రారంభించారు. అయితే లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు చోటు చేసుకుంటున్న తీరుకు భద్రాచలం పట్టణంలో ఈ మధ్య కాలంలో జరిగిన ఘటనే నిదర్శనం.

ఘటనను పరిశీలిస్తే.. ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభం కానీ ఇళ్లకు సైతం వర్తింపజేస్తూ సిబ్బంది ఫోటోలను ఇందిరమ్మ పథకం మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేశారు. ఈ విషయాన్ని పసిగట్టిన టెక్నికల్ సిబ్బంది ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అవకతవకలను గుర్తించి సిబ్బందిని తొలగించడంతో పాటు అప్‌లోడ్ చేసిన ఫొటోలను సైతం తొలగించారు. లబ్ధిదారులు ఇళ్లు నిర్మాణం చేయకుండానే బిల్లులు చేసేందుకు సిబ్బంది బేరాలు కుదుర్చుకున్నట్లు ప్రచారం జరుగుతోంది.

మెండుగా రాజకీయ జోక్యం

భద్రాచలం డివిజన్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో రాజకీయ నేతలు జోక్యం చేసుకుంటున్నట్లు విమర్శలు గుప్పుమంటున్నాయి. పథకం ప్రారంభం నుంచి నియోజకవర్గంలో ఆధిపత్య పోరు నడుస్తోంది. తాజా ఎమ్మెల్యే వర్సెస్ మాజీ ఎమ్మెల్యే అనుచరుల నడుమ ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపిక రసవత్తంగా సాగుతోంది. ఎవరికి వారు లిస్టులు సిద్ధం చేసుకోగా ఎవరికి ఇళ్లు మంజూరు అయ్యిందో తెలియక అసలైన లబ్ధిదారులు అయోమయం వ్యక్తం చేస్తున్నారు. ఇందులో కొందరు దళారులు చొరబడి బిల్లులు మేము చేసుకుంటాము మీకు ఇల్లు నిర్మిస్తాము.. అందుకు కొంత నగదు చెల్లించాలి.. అంటూ లబ్ధిదారులకు ఎరవేస్తున్నారు. అధికారులు సైతం నిమ్మకునీరెత్తిన్నట్లు వ్యవహరిస్తుండడంతో ఇళ్ల నిర్మాణ పనులు సైతం నత్తనడకన సాగుతున్నాయి.

గత ప్రభుత్వంలోనే అవకతవకలు

అశ్వాపురం: గత ప్రభుత్వ హయాంలో దళిత బంధు, బీసీ బంధు, కార్పొరేషన్ రుణాలు, సంక్షేమ పథకాలకు పైసలిచ్చినవారినే లబ్ధిదారులుగా ఎంపిక చేశారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య, మండల నాయకుడు ఓరుగంటి రమేష్ విమర్శించారు. కాంగ్రెస్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. మండలంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు జరుగుతున్నాయని సోషల్ మీడియాలో అవాకులు చవాకులు రాస్తూ బీఆర్ఎస్ నాయకులు ప్రజలను గందరగోళానికి గురిచేస్తున్నారని విరుచుకుపడ్డారు. లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరుగుతోందని వెల్లడించారు.

ఇది నిరంతర ప్రక్రియ



ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం నిరంతర జరిగే ప్రక్రియ. ప్రతి ఒక్కరూ ఇది గుర్తించాలి. అర్హులైన ప్రతి కుటుంబానికీ ఇందిరమ్మ ఇంటి పథకం వర్తిస్తుంది. ప్రజలు ప్రలోభాలకు గురికాకుండా అధికారుల సూచనలు పాటించాలి.

– బొగ్గా నారాయణ, ఎంపీడీఓ, భద్రాచలం

ఇందిరమ్మ ఇళ్ల సర్వేపై నిలదీత



గాండ్లగూడెంలో జీపీ కార్యదర్శిని ముట్టడించి నిలదీస్తున్న గ్రామస్తులు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని గాండ్లగూడెం గ్రామ పంచాయతీకి 39 ఇందిరమ్మ ఇళ్లు కేటాయించగా, ఇందిరమ్మ కమిటీ ద్వారా ఎంపిక చేసిన జాబితాను పంచాయతీ కార్యదర్శి ఎల్.మోతీలాల్ గుట్టుచప్పుడు కాకుండా సర్వే చేయడాన్ని గమనించిన కొంతమంది గ్రామస్తులు, డిప్యూటీ సీఎం భట్టి వర్గీయులు కలిసి శుక్రవారం అడ్డుకున్నారు. జాబితాలోని పేర్లు వెల్లడించాలని వారంతా నిలదీయడంతో పేర్లు చదివి వినిపించారు. ఆ జాబితాలో స్థానిక ఓ తాజా, మాజీ సర్పంచ్ పేరుతోపాటు వ్యవసాయ పట్టా భూములు, భవనాలు ఉన్న వారి పేర్లే అధికంగా ఉండటంతో కార్యదర్శిని నిలదీశారు. దీంతో కొద్దిసేపు అక్కడ ఉద్రికత్త పరిస్థితి నెలకొంది. కాగా, సర్వేను నిలిపివేయాలని గ్రామస్తులు డిమాండ్ చేయడంతో, ఇందిరమ్మ ఇళ్ల సర్వేను నిలిపివేసి కార్యదర్శి అక్కడి నుంచి వెళ్లిపోయారు.

బ్యాంక్ మేనేజర్లతో సమావేశం

మణుగూరురూరల్: రాజీవ్ యువ వికాసం పథకంపై మణుగూరు మున్సిపాలిటీ పట్టణంలోని బ్యాంకుల మేనేజర్లతో, ప్రతినిధులతో కమిషనర్ ప్రసాద్ శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజీవ్ యువ వికాసం పథకం లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత, న్యాయబద్ధత పాటించాలని సూచించారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ దగ్గర నుంచి అర్హులైన వారికి సముచిత న్యాయం జరిగేలా నిర్ణయాలు తీసుకోవాలని అన్నారు.

సమావేశంలో మున్సిపాలిటి అధికారులు, వివిధ బ్యాంకుల మేనేజర్లు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



భద్రాచలంటౌన్: బ్యాంకు అధికారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ నారాయణ

భద్రాచలంటౌన్: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం మండలంలోని తొమ్మిది బ్యాంకుల అధికారులతో రాజీవ్ యువ వికాసం పథకం అమలుపై భద్రాచలం ఎంపీడీవో బొగ్గా నారాయణ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దరఖాస్తు చేసుకున్న వారి బ్యాంక్ సిబిల్ స్కోర్ ఆధారంగా లబ్ధిదారులను ఎంపిక చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. లబ్ధిదారులు దళారులను నమ్మి మోసపోవద్దని ఆయన సూచించారు.

బాధ్యతలు చేపట్టిన ఆర్‌సీఓ

భద్రాచలంటౌన్: భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని ఖమ్మం రీజియన్ గురుకులాల సమన్వయ అధికారిని(ఆర్‌సీఓ)గా అరుణ కుమారి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె పీఓ రాహుల్‌తో పాటు ఏపీవో డేవిడ్ రాజులను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమె మాట్లాడుతూ.. గురుకులాలలోని విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలను అందించేందుకు ఉన్నతాధికారుల సహకారంతో కృషి చేస్తానని తెలిపారు.

సమ్మె నోటీసులు అందజేత

అశ్వారావుపేటరూరల్: ఈ నెల 20వ తేదీన కేంద్ర కార్మిక సంఘాలు తలపెట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్, సీపీఎం పార్టీ మండల కార్యదర్శి సోడెం ప్రసాద్ కోరారు. శుక్రవారం స్థానిక పామాయిల్, కెమిలాయిడ్స్, పేపర్ బోర్డు బాధ్యులకు సమ్మె నోటీసులను అందించారు.

‘సీతారామ’ పనులు పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు

చండ్రుగొండ: సీతారామ ప్రాజెక్ట్ పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మండల కేంద్రం చండ్రుగొండలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తొలుత జిల్లా వ్యవసాయ రంగానికి గోదావరి జలాలు అందించాలన్నారు.

గోదావరికి గండికొట్టి కాలువలు నిర్మాణాలు చేపట్టడంతో వేసవిలో జిల్లాలో తాగునీటి ఎద్దడి నెలకొందని ఆయన ఆరోపించారు. సమావేశంలో పార్టీ నాయకులు అన్నవరపు కనకయ్య, పెద్దిని వేణు, రామడుగు వెంకటాచారి, విప్పర్ల వెంకటేశ్వర్లు, మిరియాల మోహన్‌రావు, రాయి రాజా పాల్గొన్నారు.

పలువురు విద్యార్థులకు సన్మానం



అశ్వారావుపేటరూరల్: విద్యార్థులు, తల్లిదండ్రులను సన్మానించిన మాజీ ఎంపీపీ

అశ్వారావుపేటరూరల్: పది పరీక్ష ఫలితాల్లో 580 మార్కులు సాధించి నియోజకవర్గ టాపర్‌గా నిలిచిన జవహర్ విద్యాలయం విద్యార్థి పి.సాయి సంతోష్‌తోపాటు 570కి పైగా మార్కులు సాధించిన మరో 13 మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను శుక్రవారం ఘనంగా సన్మానించారు. స్థానిక జెడ్పీఎస్ఎస్ ఉన్నత పాఠశాలలో మాజీ ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి చేతుల మీదుగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు జ్ఞాపికలను అందించారు. కార్యక్రమంలో ఎంఈఓ పొనగంటి ప్రసాద్‌రావు, ఉపాధ్యాయులు కొండల రావు, ఇనుగంటి ప్రవీణ్, కిశోర్, చలపతి, రాంబాబు, బీఆర్ఎస్ నాయకులు యూఎస్ ప్రకాశ్ రావు, రఘురాం, మోహన్, గోవింద్ పాల్గొన్నారు.



మణుగూరుటౌన్: విద్యార్థులతో డీఎస్పీ రవీందర్‌రెడ్డి

మణుగూరుటౌన్: పది పరీక్షల్లో నియోజకవర్గ టాపర్లుగా నిలిచిన విద్యార్థినులను మణుగూరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి శుక్రవారం ఆయన చాంబర్‌లో అభినందించారు. సత్యభాస్కర మాంటిస్సోరి విద్యార్థిని సత్య అనిషినీ (585), సిరి (583)లను డీఎస్పీ అభినందించి శాలువాతో సత్కరించారు. సింగరేణి పాఠశాలలో 61 మంది విద్యార్థులకు 59మంది విద్యార్థులు ఉత్తీర్ణులవడంతో పాటు 97శాతం ఫలితాలు సాధించడం పట్ల ఏరియా జీఎం దుర్గం రాంచందర్ పాఠశాల ఉపాధ్యాయులను అభినందించారు. శుక్రవారం జీఎం చాంబర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన పీవీకాలనీ సింగరేణి స్కూల్ విద్యార్థులను తేజశ్రీ(552), సాయిచరణ్ (543)లతో పాటు 500 పైగా మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు.

వైభవంగా ఆత్మారాముడి కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న అర్చకులు, పక్కన ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం గ్రామంలో పవిత్ర గోదావరి నదీ తీరాన ఆత్మారామచంద్రస్వామి వారి కల్యాణాన్ని అర్చకులు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ముందుగా ఆలయంలో సుప్రభాతం, అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం స్వామి వారిని కల్యాణ మండపంలో కొలువుదీర్చారు. కెల్లా శేఖర్–సంధ్య దంపతులు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించి పీటలపై కూర్చోగా.. భక్తుల జయజయధ్వానాల నడుమ అర్చకులు కల్యాణం జరిపించారు. ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మధ్యాహ్నం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం స్వామి వారిని గ్రామ పురవీధుల గుండా గ్రామ సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి సుదర్శన్, తహసీల్దార్ అశోక్‌కుమార్, అర్చకులు కొంపెల్లి సత్యనారాయణ, గ్రామస్తులు లంకా రాంప్రసాద్, గద్దం బాలాజీ, బత్రి నరసింహారావు, గోర్స అశోక్, సన్యాసి రెడ్డి, కెల్లా వేణుగోపాల్, కాంగ్రెస్ నాయకులు లంకా శ్రీనివాసరావు, మట్టా శివాజీ తదితరులు పాల్గొన్నారు.

బాలల సదనం సందర్శన



సదనంలోని పిల్లలతో మెజిస్ట్రేట్ సూరిరెడ్డి

మణుగూరురూరల్: మున్సిపాలిటీ పరిధిలోని శివలింగాపురంలో గల బాలల సదనాన్ని మణుగూరు ప్రథమశ్రేణి జ్యుడీషియల్ కోర్ట్ మెజిస్ట్రేట్ కె.సూరిరెడ్డి శుక్రవారం సదర్శించి పరిసరాలను పరిశీలించారు. సదనంలో పిల్లలకు అందిస్తున్న సేవలపై, వసతి సౌకర్యాలపై నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు.

అలాగే పిల్లలతో మాట్లాడి వారి యోగక్షేమాలను తెలుసుకున్నారు. అనంతరం పిల్లలకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు అంకం సర్వేశ్వరరావు, మేదరమెట్ల శ్రీనివాస్, పోశం భాస్కర్, వాగబోయిన రమేష్, బాలల సదనం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆదిశంకరాచార్యుల జయంతి



మణుగూరురూరల్: పూజల్లో పాల్గొన్న స్థానికులు

మణుగూరురూరల్: మండలంలోని గుట్టమల్లారం గ్రామపంచాయతీ జయశంకర్‌నగర్ కాలనీలోని అనంత సద్గురు ఆత్మబోధ అమృత గాయత్రి జ్ఞాన పీఠంలో వ్యవస్థాపకుడు, ధర్మకర్త బ్రహ్మశ్రీ దయానిధి అక్కినేపల్లి వసంతాచార్యులు ఆధ్వర్యంలో జగద్గురు ఆదిశంకరాచార్యులు, శ్రీరామానుజచార్యుల జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జ్ఞానపీఠంలో ప్రత్యేక పూజలు చేయడంతో పాటు శంకరాచార్యుల ఆత్మబోధన, ఆత్మవిచారణ, సౌందర్యలహరి, గీతాపారాయణం, రామానుజచార్యుల నారాయణ నామ స్వరన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో గాండ్ల సురేష్, నానిచౌదరి, వెంకట్‌రావు, భక్తులు పాల్గొన్నారు.

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలో భద్రాద్రి బ్రాహ్మణ పురోహిత సంఘం ఆధ్వర్యంలో ఆదిశంకరాచార్య స్వామి, రామానుజ జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గాయత్రీ బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామావజ్జల రవికుమార్ శర్మ మాట్లాడుతూ.. ఆది శంకర, రామానుజ స్వామివార్లు సమాజానికి అనేక సేవలు చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పవన్ కుమార్ శర్మ, శ్రీనివాస్, రామకృష్ణ శాస్త్రి, కలకోట శ్రీనివాసాచార్యులు, ఆర్వి శ్రీనివాస్ శర్మ, రాజేశ్వర శర్మ, కల్యాణ్ రామ్ శర్మ, జగన్నాధా చార్యులు, లక్ష్మీనరసింహ శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ కగార్ నిలిపివేయాలి



మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు అయోధ్య

మణుగూరుటౌన్: ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసీలను, పేద ప్రజలను వేధిస్తున్నారని, వెంటనే ఈ కార్యక్రమాన్ని నిలిపివేయాలని అఖిలపక్ష రాజకీయ పార్టీ, ప్రజా సంఘాలు కోరాయి. శుక్రవారం సీపీఐ పార్టీ కార్యాలయంలో సమావేశం దుర్గ్యాల సుధాకర్ అధ్యక్షతన జరగ్గా, సీపీఐ రాష్ట్ర నేత అయోధ్య, ఆదివాసీ సంఘం ఉమ్మడి రాష్ట్ర మాజీ అధ్యక్షుడు వట్టం నారాయణ దొర, కాంగ్రెస్ నాయకులు కాటబోయిన నాగేశ్వరరావు, సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నేత మిడిదొడ్ల నాగేశ్వరరావుల తో పాటు పలువురు నాయకులు మాట్లాడారు. కగార్ పేరుతో పోలీసులు చేస్తున్న యుద్ధ వాతావరణాన్ని వెంటనే నిలుపుదల చేయాలని, ఆ మేరకు కేంద్ర బలగాలను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జ్యోతిబసు, సోమేశ్వరగౌడ్, పెనుగొండ సాంబశివరావు, బోయిళ్ల వెంకటేశ్వర్లు, జంగం మోహన్ రావు, రాయల భిక్షం, సర్వర్, తదితరులు ఉన్నారు.

దుర్గంధం వెదజల్లుతోంది..

- రోడ్డుపై పేరుకుపోయిన మురుగు నీరు
- బీసీ హాస్టల్లోకి ప్రవాహం
- నెలలు గడుస్తున్నా దృష్టి సారించని వైనం



గ్రామంలోకి వెళ్లే సీసీ రోడ్డు గుండా హాస్టల్ ఆవరణలోకి ప్రవహిస్తున్న మురుగునీరు

ములకలపల్లి: ములకలపల్లి మండలకేంద్రంలోని గ్రోమోర్ షాపు ఎదుట మురుగునీటి నిల్వ దుర్గంధం వెదజల్లుతోంది. గత కొన్ని నెలలుగా ఇక్కడ మురుగు పేరుకుపోయి ఉన్నా, పట్టించుకునేవారే కరువయ్యారని స్థానికులు వాపోతున్నారు.

మెయిన్ సెంటర్ నుంచి ఊళ్లోకి వెళ్లే దారిలో భారీగా మురికినీరు పేరుకుని ఉంది. ఎగువ భాగంలోని ఇళ్లు, వ్యాపార సముదాయాల నుంచి నీరంతా వచ్చి నిల్వ ఉండడం, ఇదే ప్రదేశంలో కొబ్బరి బోండాలు, ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తాచెదారం పడేయడంతో దుర్వాసన వస్తోంది. దోమలు, ఈగలు చేరిపోయాయి.

రోడ్డుకు అడ్డంగా మట్టి కుప్పలు

గ్రోమోర్ షాపు ఎదురుగా సుమారు ఏడేళ్ల క్రితం అంతర్గత రోడ్ల నిర్మాణంలో సీసీ రోడ్లు వేశారు. ఇన్నేళ్లూ స్థానికులు ఇదే రోడ్డును వినియోగించారు. ఐతే ఇటీవల తమ పట్టాభూమిలో సీసీ రోడ్డు వేశారంటూ పట్టాదారులు కోర్టును ఆశ్రయించారు. వివాదం కోర్టు పరిధిలో ఉన్న క్రమంలోనే, స్థానికులు వినియోగిస్తున్న సీసీ రోడ్డుకు అడ్డంగా మట్టికుప్పలు వేశారు. దీంతో ఈ రోడ్డు గుండా మనిషి నడిచే దారి కూడా లేకుండా పోయింది. మట్టికుప్పలపై చెట్లు పెరిగిపోవడం, చెత్తాచెదారం పేరుకుపోవడంతో అసలు అక్కడ సీసీ రోడ్డు ఉందా? అనేలా తయారైంది. మరోవైపు, గతంతో ఈ రోడ్డు పక్కన ప్రవహించి, కోనేటిలో కలిసిన మురుగునీరు.. ఇప్పుడు మట్టి అడ్డంగా ఉండడంతో భారీగా నిల్వ ఉంటోంది. ఎక్కువైన మురుగంతా ఊళ్లోకి వెళ్లే సీసీ రోడ్డు పక్కగా ప్రవహించి, ఎస్టీ హాస్టల్ ఆవరణలోకి వెళుతోంది. దీంతో వసతి గృహంలోని విద్యార్థులు నానాతిప్పలు పడుతున్నారు. అంతేకాకుండా గ్రామంలోని వెళ్లే రోడ్డుపై నిలిచిన మురుగు వాహనాలు వెళుతున్న క్రమంలో చిమ్మి పాదచారులపై పడుతోంది.

పట్టింపులేని అధికారులు

ప్రభుత్వ నిధులతో వేసిన సీసీ రోడ్డు నిర్మించిన సుమారు ఆరేళ్ల కాలం తరువాత పట్టాదారులు తమభూమి అంటూ మట్టికుప్పలు అడ్డంగా వేయడం విస్మయానికి గురిచేస్తోంది.

ఇంతజరుగుతున్నా, జీపీ అధికారులు, స్థానిక పంచాయతీ రాజ్ అధికారులు స్పందించకపోవడం పట్ల పలువురు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి, తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వ్యాపారం మూసివేశాం..



భారీగా మురుగునీరు పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది. దోమల బెడదతో అల్లాతున్నాం. కుటుంబ పోషణకు చిల్లర కొట్టు పెట్టుకున్నా. దుర్వాసనకు ఎవరూ రాకపోవడంతో మూసేశాం.

– కరీం, ములకలపల్లి

డ్రెయినేజీ ఏర్పాటు చేస్తాం..



మురుగునీటి సమస్య పరిష్కారానికి డ్రెయినేజీ నిర్మిస్తాం. నిధుల లేమితో పనులు ఆలస్యమయ్యాయి. కోర్టు పరిధిలో ఉండడంతో మట్టికుప్పల అంశంలో ముందుకు పోలేకపోతున్నాం.

– రవి, పంచాయతీ కార్యదర్శి